# పీడిత హృదయం

"ఎక్కడికిరా?" అని అడిగాడు కామయ్య

జుట్టు దువ్వుకొని, ఉతికిన చొక్కా వేసుకొని బయల్దేరిన రాముడు మేనమామ ప్రశ్నవిని వరండాలోవాడు వరండాలోనే ఆగిపోయాడు—"మీటింగుకి వెళ్తున్నాను. ఇప్పుడే వస్తాను," అన్నాడు.

మీటింగుకి అనేటప్పటికి కామయ్యకు ఎక్కడలేని కోపం వచ్చింది_"ఓరి వెధవా, నీ మొహానికి మీటింగులు కావలసి వచ్చినై? ఇంత కూడు పడేస్తూవుంటే తిని వుండలేక——" అని నానా చివాట్లూ పెట్టాడు. చివరికి గడపదాటి బయట అడుగు పెట్టితే ముక్కలు ముక్కలుగా నరుకుతా నన్నాడు.

రాముడు కిక్కురు మనకుండా ఇంట్లోకి వెళ్ళాడు. వాడు తల్లి పోయిందగ్గర్నుంచీ మేనమామ ఇంట్లోనే పెరుగుతున్నాడు. మేనమామ తిట్టినా, తిమ్మినా ఎదురు తిరగాలనే భావం వాడి కెన్నడూ కలుగలేదు.

కాని మీటింగుకివెళ్ళొద్దనేటప్పటికి వాడికిఉక్రోషం వచ్చింది. కమ్యూనిస్టుల్ని చూడాలనీ, వాళ్ళ ఉపన్యాసాలు వినాలనీ, వాళ్ళతో మాట్లాడాలనీ, ఎన్నాళ్ళనుంచో కుతూహల పడు తున్నాడు. ఈ మీటింగుకోసం నెలరోజుల్నించీ క్షణాలు లెక్క పెట్టుకుంటూ కూర్చున్నాడు.

రాముడికి ఇంత అపేక్షగలగటానికి కారణం లేకపో వాడు చదువుకునే స్కూల్లో రంగడూ, గంగడూ అనే కుర్రవాళ్ళున్నారు. వాళ్ళెప్పుడూ స్కూలుకి సరిగ్గా కాదు. ఎప్పుడూ పాఠాలు చదివిన పాపాన పోయేవా

ఇవాళ ఇక్కడుంటే రేపు మరొకవూళ్ళో వుండేవారు. ఎల్లుండి ఇంకొకవూరు. వూళ్ళో వున్నకాసేపయినా గుక్కతిరక్కుండా తిరుగుతుండేవాళ్ళు. ఉండి ఉండి నాలుగైదురోజులు అయిపు లేకుండా పోయేవారు.

ఒకరోజు రంగడూ, గంగడూ వొచ్చి, "మనంస్కూలుకి వెళ్ళవద్దు. మనతోటి విద్యార్థుల్ని పరీక్షకు పంపకుండా హెడ్ మాష్టరు ఆపాడు. వాళ్ళని బడికి పంపేవరకూ మనం స్కూల్లో అడుగు పెట్టవద్దు," అని చెప్పారు.

విద్యార్థులు సరేఅంటే సరే అన్నారు. ఒక్కడుకూడా స్కూలుకి వెళ్ళకుండా కూర్చున్నారు. రాముడు పుస్తకాల్తో తయారయేటప్పటికి రంగడూ, గంగడూ తటస్థపడి స్కూలుకి వెళ్ళకుండా చేశారు. అదేమిటో! వూళ్ళోవున్న పెద్దవాళ్ళంతా వొచ్చి రంగడితో గంగడితో మాట్లాడేవారు! చివరికి హెడ్ మాష్టరు ఆ విద్యార్థుల్ని పరీక్షకు పంపాడు. అంతా, "రంగడికీ గంగడికీ జై," అన్నారు. గంతులు వేసుకుంటూ స్కూలుకి వెళ్ళారు.

రాముడికేమీ అర్థంకాలేదు. హెడ్ మాష్టర్ ఆవిద్యార్థుల్ని మళ్ళీ పరీక్షకు ఎందుకు పంపాడు? విద్యార్థులు స్కూలుకి వెళ్ళకపోతే హెడ్ మాష్టరు కేమి నష్టం? ఊళ్ళో పెద్దలంతా రంగడితో గంగడితో ఏం మాట్లాడారు? ఊళ్ళో పెద్దలకీ, టాని ఏం సంబంధం?—రాత్రంతా ఇవే ఆలోచనలు. రాముడికి పెడుతూలేదు. తెల్లవారి, మేనమామ వాడిని పిలిచి, "ఒరేయ్ తున్నాన్ గంగడితో స్నేహం చేసేవు, జాగ్రత్త," అన్నాడు.

రాముడేమీ మాట్లాడలేదు.

మేనమామ, "రంగడితో, గంగడితో మాట్లాడేవు, జాగ్రత్త అన్నాడు.

రాముడేమీ మాట్లాడలేదు.

మేనమామ, "వాళ్లు కమ్యూనిస్టులు, జాగ్రత్త," అన్నాడు.

అప్పట్నించీ కమ్యూనిస్టులంటే ఎవ్వరో తెలుసుకోవాలని పుట్టింది రాముడికి. ఎవ్వరికీ తెలియకుండా రంగడితో గంగడితో స్నేహం చెయ్యటానికి ప్రయత్నించాడు, వాళ్లేంచేస్తారు? ఏం మాట్లాడుకుంటారు? ఎందుకిదంతా? విద్యార్థుల్ని పరీక్షకు పంపకపోతే వీళ్ళకేంనష్టం? కాని రంగడూ, గంగడూ రాముణ్ణి పిల్లవాడికింద కట్టి దగ్గరకు రానిచ్చేవాళ్ళుకాదు. దానిమీద ఇతర విద్యార్థుల్ని, "కమూనిస్టులు ఏంచేస్తారు?" అని అడిగి చూశాడు. వాళ్ళు జవాబు చెప్పకుండా వాణ్ణి వింతగా చూచి ఊరుకున్నారు.

ఒకడుమాత్రం, "గల్లంతు," అన్నాడు.

"ఎందుకు?"

ఈ ప్రశ్నకుమాత్రం ఎవ్వరూ జవాబుచెప్పలేదు. రాముడికి ఆరాటం హెచ్చింది. ఇటువంటి సమయంలో, ఆ ఊళ్లో కమ్యూ నిస్టులు మీటింగుపెడతారనీ, ఉపన్యాసాలిస్తారనీ, కాత్రే జీ మేశ్వరప్రసాద్ అధ్యక్షత వహిస్తాడనీ, తెలిసింది. రా సంతోషం చెప్పలేం! రోజులు లెక్కపెట్టుకుంటూ క న్నాడు. గంటలు లెక్కపెట్టుకుంటూ కూర్చున్నాడు. ని లెక్కపెట్టుకుంటూ కూర్చున్నాడు. మీటింగువేళ

జుట్టు దువ్వుకొని, ఉతికిన చొక్కా తొడుక్కొని వెళ్ళబోయే సరికి మేనమామ వీల్లేదన్నాడు. గడపదాటి బయట అడుగు పెడితే నరికి పోగులు పెడతా నన్నాడు.

రాముడికి ఉక్రోషం వచ్చింది.

రాముడికి కోపం వచ్చింది.

రాముడికి ఆవేశం కలిగింది.

రాముణ్ణి నూతనశక్తి ఆవహించింది.

ఒక్కసారి వాడి హృదయం కట్లు తెంచుకుంది. వెళ్ళాల్సిందే! చూడాల్సిందే! వినాల్సిందే! ఏమైనాసరే! మేనమామ ఏమన్నాసరే! వెంటనే లేచాడు. గది తలుపు పగలగొట్టాడు. దొడ్డిగోడ దూకాడు. మీటింగుదగ్గరకు పరిగెత్తాడు.

వాడు వెళ్ళేటప్పటికి కామ్రేడ్ సోమేశ్వరప్రసాద్ ఉపన్యసిస్తున్నాడు. అష్టకష్టాలూపడి, రాత్రిఅనక పగలనక చమటూడ్చి భూమిని పండించేది మీరు. ఆపంటనీ, భోగాల్నీ, అనుభవించేది మరొకరు, అన్నాడు. రాముడు తదేకధ్యానంతో విన్నాడు. వాడికిది చిత్రంగా కనిపించింది. ఇప్పటివరకూ భూమి ధనవంతుల సొంతం గనక కూలి ఇచ్చి వ్యవసాయం చేయించుకుంటున్నారనుకున్నాడు. కూలిఇవ్వటమేవాళ్ళధార్మికగుణాన్ని రూపిస్తుందనుకున్నాడు. ఇప్పుడు సోమేశ్వరప్రసాద్ ఎవ్వరు డించుకున్నభూమి వారిదే అంటున్నాడు. డబ్బుని సృష్టించేది రు. అనుభవించేది ఇంకొకరు అన్నాడు, సోమేశ్వరప్రసాద్. డు ఆశ్చర్యపడ్డాడు. ఇన్నాళ్లూ వాళ్ళు దయతలిచి వీళ్ళకి టుబడిపెట్టి పోషిస్తున్నారనుకున్నాడు. ఇప్పుడు డబ్బ ళ్ళదే! వీళ్ళదే! వీళ్ళడబ్బునే వాళ్ళు దోచుకుంటున్నారు.

అంటున్నాడు సోమేశ్వరప్రసాద్. ప్రభుత్వాన్ని నిలిపేది మీరు; పెత్తనం చేసేది వాళ్ళు అన్నాడు సోమేశ్వర్ ప్రసాద్. రాముడు నోరు తెరచుకొని విన్నాడు. ఇన్నాళ్ళూ వీళ్ళ శ్రేయస్సుకోసం కనికరించి, ధనవ్యయం చేసి వీళ్ళని కాపాట్టానికి వాళ్ళు ప్రభుత్వాన్ని నెలకొల్పారనుకున్నాడు. ఇప్పుడు మీరు నిలబడుతున్న ప్రభుత్వాన్ని వాళ్ళు స్వార్థానికి ఉపయోగించు కుంటున్నారు అంటున్నాడు, కామ్రేడ్ సోమేశ్వర ప్రసాద్. రాముడు కదలకుండా, మెదలకుండా, కనురెప్ప వెయకుండా ఉపన్యాసం విన్నాడు. కామ్రేడ్ సోమేశ్వర ప్రసాద్ తన వుపన్యాసాన్ని ఈ విధంగా ముగించాడు—

"మనం బానిసలం. బానిసలక్షణాలు మనరక్తంలో జీర్ణించి పోయినయ్. అందుకని పరదేశం వొచ్చి గడపలో అడుగుపెట్టినా మనకు చలనంలేదు. వింటాం. వూరుకుంటాం. లెండి, లెండి."

రాముడు వుపన్యాసం సాంతంగా విన్నాడు. ఉడికిపోయాడు. వుపన్యాం పూర్తవ్వగానే గబగబా వేదిక దిగుతున్న సోమేశ్వర ప్రసాద్ దగ్గరకు వెళ్ళాడు. తడబడుతూ అడిగాడు—"నన్ను కూడా జేర్చుకోండి."

కామ్రేడ్ సోమేశ్వరప్రసాద్ రాముణ్ని ఒకక్షణం తేరిపారచూశాడు. చిరునవ్వు నవ్వాడు. బుగ్గమీద చిటికెవేస్తూ చెప్పాడు—"నువ్వు పిల్లవాడివి. తొందరేం? ఇంటికివెళ్ళు."

"ఇల్లు లేదు"

"అమ్మ ఎక్కడుంటే అక్కడకు వెళ్ళు."

"అమ్మ లేదు"

"నాన్నదగ్గరకు వెళ్ళు."

"నాన్న లేడు"

"ఎక్కడ వుంటున్నావు?"

"మామయ్య దగ్గర"

కామ్రేడ్ సోమేశ్వరప్రసాద్ కొంచం సేపు ఆలోచించాడు చివరికి, 'అక్కడికే వెళ్ళు' అని చెప్పి, చిరునవ్వు నవ్వి వెళ్ళి పోయాడు.

రాముడి గుండెలు గుభేలుమన్నయ్. తనేంచేశాడు? తన్నెందుకు తీసుకోరు? తనలో ఏం లోటుంది? తనెందుకూ పనికి రాడూ? రంగడీ గంగడీపాటి చెయ్యడూ! వెక్కెక్కి ఏడుస్తూ అక్కడే—సోమేశ్వరప్రసాద్ విడిచిపెట్టి పోయినచోట—చతికిలబడ్డాడు.

చీకటి పడింది.

మేనమామ రాముణ్ని వెతుక్కుంటూ వచ్చాడు. చూశాడు. తాను వద్దన్నకొద్దీ, తనమాట తిరస్కరించి మీటింగుకు వచ్చాడని మండిపోయాడు.

"రామా?"

"రాముడూ?"

"ఒరేయ్?"

రాముడు ఉలిక్కిపడి, మామని గుర్తుపట్టాడు. లేచి నిల ...డు.

జీవి? ...ధవా! అప్పుడే కళ్ళు నెత్తికొచ్చినయ్? ఇంతపొగరా...

టాని ...ందేమిటి? నువ్వు చేసిందేమిటి?" అని చేతిలోవున్న

పెడుతు ... బాదాడు. ఎడా పెడా కొట్టాడు. తుక్కురేగేటట్టు

తున్నాన ... రాముడు మాత్రం కుంయి కంయి మనలేదు. అలాగే

నిలబడ్డాడు. మేనమామని తేరిపార చూచాడు.

వాడి చూపులు మేనమామకి వికృతంగా, వికారంగా కని పించినయ్. అతనికి భయం వేసింది. ఎగశ్వాసతో అలాగే నిల బడిపోయాడు. చేతిలోని పలుపు అలాగే వేలాడుతూవుంది.

రాముడు దృఢనిశ్చయంతో నెమ్మదిగా అడుగులు వేసు కుంటూ బయల్దేరాడు. మేనమామ పిలుద్దామనుకున్నాడు. మళ్ళీ బాద్దామనుకున్నాడు. కాని ఏదో భయం—ఏదో అను మానం—ఏదో ఆందోళన. పిలవలేకపోయాడు; కదల్లేక పోయాడు.

రాముడు నెమ్మదిగా సోమేశ్వరప్రసాద్ విడిదికి వెళ్లాడు. అతడు రాముణ్ణిచూచి, "ఏం అబ్బాయి, మళ్ళీ వొచ్చావ్?" అన్నాడు.

"నన్ను మీ పార్టీలో జేర్చుకోండి." అన్నాడు రాముడు. ఈసారి రాముడి మాటల్లో ఆతురతగానీ, ఆవేశంగానీ లేదు.

"ఎందుకబ్బాయి అంత తొందర!"

"తొందర కాదు"

"మరేమిటి"

"చేరాలి"

"ఆ !!"

రాముడు మాట్లాడలేదు. సోమేశ్వరప్రసాద్ లాంతరు పైకెత్తి చూశాడు. రాముడి చెంపలమీద కణుపులు కనిపిం చాయి—"ఏమిటది!" అన్నాడు.

రాముడు మాట్లాడలేదు.

"ఎవరు కొట్టారు!"

"మామయ్యా"

"ఎందుకు?"

"మీాటింగు కొచ్చాననీ"

కామ్రేడ్ సోమేశ్వరప్రసాద్ ఒక్క క్షణం ఆలోచించాడు. రాముణ్ణి నఖశిఖ పర్యంతం పరిశీలించాడు—"రా, నాయానా" అని కౌగలించుకున్నాడు.

తెల్లవారికూడా రాముడు రాకపోయే టప్పటికి రాముడి మేనమామ పోలీసులకు రిపోర్టు చేశాడు. పోలీసులు ఊరంతా గాలించారు. కామయ్య ఇల్లు వెతికారు. కామయ్య ఇంట్లో బావి వెతికారు. కామ్రేడ్ సోమేశ్వరప్రసాద్ విడిది వెతికారు. కాని ఎక్కడా రాముడు కనిపించ లేదు.

కామ్రేడ్ సోమేస్వరప్రసాద్ మాత్రం రాముడి మేనమామ కామయ్య కనిపించినప్పుడల్లా, "తొందరపడకూ! వస్తాళ్ళే! పెద్ద వాడయి వస్తాడు." అంటూవుండేవాడు. కొంతకాలం గడచిం తరువాత ఎవ్వరో రాముడి బొమ్మ పేర్లతో చూచానని చెబితే కామయ్య నమ్మలేదు. "ఛూత్" అన్నాడు.

❋